ప్రతి ఓటు విలువైనదే

- యువత ఎన్నికల్లో పాల్గొనాలి
- దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ విలువైనదని, ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకొని దేశ ప్రగతిలో భాగస్వామ్యం కావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం రవీంద్రభారతిలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఓటరు జాబితా అత్యంత ప్రధానమైనదని పేర్కొన్నారు. తెలంగాణలో అందరి సహకారంతో ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగాయని తెలిపారు. యువత ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ఉద్బోధించారు. అనంతరం కొత్తగా ఓటు హక్కు పొందిన యువ ఓటర్లకు గుర్తింపు కార్డులను గవర్నర్ అందజేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించి

డంతోపాటు ఎన్నికల్లో ప్రతిభ కనబర్చిన అధికారులను అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో సీఈవో తెలంగాణ సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, అడిషనల్ సీఈవో లోకేశ్ కుమార్, జీహెచ్ ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిప్యూటీ సీఈవోలు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సూత్రాలతో తెలంగాణ ఏర్పాటు

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): రాజ్యాంగంలో పొందుపర్చిన సూత్రాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలు, యువకుల ప్రాణత్యాగాలతో తెలంగాణ అవతరించిందని పేర్కొన్నారు. నేడు గణతంత్ర దినోత్సవం మాత్రమే కాదని.. రాజ్యాంగ సూత్రాలతో తెలంగాణ ఏర్పడిన ప్రత్యేకమైన రోజు అని గవర్నర్ ఉద్ఘాటించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మనమంతా భారత రాజ్యాంగంలోని ఆలోచనలు, హక్కులు, బాధ్యతలు, విలువలకు పునరంకితం కావాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

హైకోర్టు మొదటి కోర్టు హాలులో ప్రమాణ స్వీకారం చేస్తున్న న్యాయమూర్తులు

కొత్త న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

- హైకోర్టు మొదటి హాలులో ప్రమాణం చేయించిన యాక్టింగ్ సీజే

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు కొత్తగా నియమితులైన నలుగురు న్యాయమూర్తులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో జిల్లా జడ్జీల కోటా నుంచి నియమితులైన హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుక యారా, సిటీ సివిల్ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జి నందికొండ నర్సింగరావు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఎడ తిరుమలాదేవి, హైకోర్టు పరిపాలన విభాగం రిజిస్ట్రార్ బొబ్బిలి రామయ్య మధుసూదన్‌రావు ఉన్నారు. హైకోర్టు మొదటి కోర్టు హాలులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ వీరితో ప్రమాణం చేయించారు. రాష్ట్రపతి జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను హైకోర్టు తాత్కాలిక రిజిస్ట్రార్ జనరల్ చదవి వినిపించారు.

పోలీసు మెడల్స్ గ్రహీతలకు డీజీపీ అభినందన

కే రామ్‌కుమార్

ఫజ్లూర్ రెహమాన్

వేణుగోపాల్

ఈశ్వరయ్య

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): గణతంత్ర దినోత్సవం సందర్భంగా పతకాలు అందుకున్న పోలీసు అధికారులు, హోంగార్డులను డీజీపీ జితేందర్ శనివారం తన కార్యాలయంలో అభినందించారు. రాష్ట్రపతి పతకం అందుకున్నవారిలో హైదరాబాద్ సిటీ లా అండ్ ఆర్డర్ అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్‌మాన్, ఐఎస్‌డబ్ల్యూ ఇంటెలిజెన్స్ ఎస్పీ మాణిక్‌రాజ్, మెరిటోరియస్ సర్వీస్ పతకం అందుకున్నవారిలో ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, శంషాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్ జోన్ అదనపు డీసీపీ మొహమ్మద్ ఫజ్లూర్ రెహమాన్, ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ ముత్యంరెడ్డి, ఐఎస్‌డబ్ల్యూ డీఎస్పీ కేవీ రమణ, డీజీపీ ఆఫీస్ డీఎస్పీ వేణుగోపాల్, మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, 1వ బెటాలియన్ ఏఎస్ఐ ఠాకూర్, 8వ బెటాలియన్ ఏఆర్ ఎస్ఐ పీటర్ జోసెఫ్ బహదూర్, ఏఆర్ఎస్ఐ సీఐ సెల్ మొయినుల్లా ఖాన్, ఐఎస్‌డబ్ల్యూ హెడ్‌కానిస్టేబుల్ వీ పథ్య నాయక్, గ్రేహౌండ్స్ హెడ్‌కానిస్టేబుల్ ఎండీ అయూబ్ ఖాన్ ఉన్నారు. వీరితో పాటు ఎంఎస్ఎం మెడల్ అందుకోనున్న హోంగార్డులు మంత్రి ఈశ్వరయ్య, యాదగిరి, లక్ష్మణ్, ఐలయ్యలను డీజీపీ జితేందర్ అభినందించారు.

నీట్ -యూజీలో ఐచ్ఛిక ప్రశ్నలు ఔట్

- అన్నింటికి సమాధానాలు రాయాల్సిందే
- పరీక్షా సమయం 180 నిమిషాలే
- కీలక మార్పులు ప్రకటించిన ఎన్టీఏ

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : నీట్-యూజీ పరీక్షల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) కీలక మార్పులు చేసింది. ఐచ్ఛిక ప్రశ్నలను తొలిగించింది. ఇక నుంచి విద్యార్థులు అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. పరీక్షా సమయాన్ని 180 నిమిషాలకు కుదించింది. కొవిడ్ నేపథ్యంలో 2020లో 20 చాయిస్ ప్రశ్నలివ్వగా, పరీక్షా సమయాన్ని 200 నిమిషాలకు ఎన్టీఏ పెంచింది. కొవిడ్‌కు పూర్వమున్న పరీక్షావిధానాన్ని ఈ ఏడాది నుంచి పునరుద్ధరించింది. ఇక నీట్-యూజీ పరీక్షను మే 4న ఆఫ్‌లైన్ పద్ధతిలో నిర్వహించనున్నది. నీట్-యూజీ రిజిస్ట్రేషన్‌కు అపార్ ఐడీ తప్పని సరికాదని ఎన్టీఏ ప్రకటించింది.

బ్యాంకులకు నిధులు కటకట!

- 3 లక్షల కోట్లకు చేరిన లోటు

న్యూఢిల్లీ, జనవరి 25: ఏ పని ముట్టుకోవాలన్న డబ్బే ప్రధానం. కానీ ఈ డబ్బును రుణాలుగా ఇచ్చే బ్యాంకుల వద్ద నగదు కొరత తారా స్థాయికి చేరుకున్నది. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు నిధుల లేమితో సతమతమవుతున్నాయి. నిధులు లభించకపోవడంతో భారీ ప్రాజెక్టులకు రుణాలు ఇవ్వడానికి జంకుతున్నాయి. దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థ లిక్విడిటీ లోటు పదేండ్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ లోటు రూ.3.3 లక్షల కోట్లు(38.2 బిలియన్ డాలర్లు)గా ఉన్నట్లు బ్లూంబర్గ్ ఎకానమి ఇండెక్స్‌లో వెల్లడించింది. 2010 తర్వాత నగదు కొరత ఇంతటి స్థాయిలో ఉండటం ఇదే ప్రథమం.

బ్యాంకింగ్ మార్జిన్లపై ప్రభావం

నిధులు లేక సతమతమవుతున్న బ్యాంకులు తమ మార్జిన్లపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు విశ్లేషకులు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ గణనీయంగా పడిపోతుండటం, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు భగ్గుమంటుండటంతోపాటు యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు లిక్విడిటీ తగ్గడానికి ప్రధాన కారణాలని నిపుణులు అంచనావేస్తున్నారు. రూపాయి పతనాన్ని అడ్డుకట్ట వేయడానికి రిజర్వు బ్యాంక్ తనవద్దనున్న డాలర్లను విక్రయిస్తున్నది. అలాగే వేరియబుల్ రేపోరేటు వేలాన్ని నిర్వహిస్తున్నది. బ్యాంకింగ్ వ్యవస్థలోకి నిధుల ప్రవాహాన్ని పెంచేందుకు రోజువారిగా వేలం నిర్వహిస్తున్నది. గడిచిన పదిహేను రోజుల్లోనే రెండుసార్లు నిర్వహించిన వేలం ద్వారా రూ.1.45 లక్షల కోట్ల నిధులను మార్కెట్లోకి చొప్పించింది.

ఐసీఐసీఐ ఆకర్షణీయం

న్యూఢిల్లీ, జనవరి 25: ఐసీఐసీఐ బ్యాంక్ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.11,792 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.10,272 కోట్లతో పోలిస్తే 15 శాతం వృద్ధిని కనబరిచింది. బ్యాంక్ ఆదాయం కూడా రూ.42,792 కోట్ల నుంచి రూ.48,368 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ ఈకి సమాచారం అందించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.3 శాతం నుంచి 1.96 శాతానికి తగ్గగా, అలాగే నికర ఎన్‌పీఏలు కూడా 0.44 శాతం నుంచి 0.42 శాతానికి దిగొచ్చాయి.

ఎన్‌టీపీసీ లాభం 5,169 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 25: విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.5,169.69 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతిక్రతం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.5,208.87 కోట్ల లాభంతో పోలిస్తే స్వల్పంగా తగ్గినట్లు పేర్కొంది. పన్నులకు అధికంగా నిధులు వెచ్చించడంవల్లనే లాభాలపై ప్రభావం చూపాయని పేర్కొంది. కంపెనీ ఆదాయం ఈసారి రూ.45,597.95 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది.

ప్రస్తుతం నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థలు నగదు కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీంతో ఎన్‌బీఎఫ్‌సీలు అత్యధిక వడ్డీకి రుణాలు తీసుకొవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నిధుల కొరత రాకుండా పలు చర్యలు తీసుకోవాలి.

- సంజీవ్ బజాజ్, బజాజ్ ఫిన్‌సర్వ్ సీఎండీ

ఆర్థిక రంగానికి చేటు

నిధులు లేక బ్యాంకులు సతమతమవుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థకు చేటు చేయనున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచంలో అత్యంత వేగవంతమైన వృద్ధిని నమోదు చేసుకుంటున్న భారత ఆర్థిక వ్యవస్థకు బీటలు పడే ప్రమాదం ఉన్నదని వారు హెచ్చరిస్తున్నారు. అతిపెద్ద బ్యాంకులు తమ రుణాలు ఇవ్వడానికి వెనుకంజ వేసే అవకాశాలుండటంతో అతిపెద్ద ప్రాజెక్టులు నత్తనడకన సాగే ప్రమాదం ఉన్నదంటున్నారు. మరోవైపు డిపాజిట్లు అంతంత మాత్రంగానే ఉండటంతో బ్యాంకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

ఒసాము సుజుకీకి పద్మ విభూషణ్

న్యూఢిల్లీ, జనవరి 25: జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం సుజుకీ మోటార్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఒసాము సుజుకీ(ఇటీవల మరణించారు)కి పద్మ విభూషణ్ అవార్డును ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. దేశీయ ఆటోమొబైల్ రంగంలో విశేష కృషి చేసిన ఆయనకు దేశంలో రెండో అతిపెద్ద అవార్డును ప్రకటించడం విశేషం. దేశీయ వాణిజ్య, పారిశ్రామిక రంగంలో కీలక పాత్ర పోషించిన పది మందికి పద్మా అవార్డులు అందించబోతున్నది మోదీ సర్కార్. వీరిలో ఒసాముకు పద్మ విభూషణ్, మరో ఇద్దరికి పద్మభూషణ్, మరో ఏడుగురికి పద్మ అవార్డులు ప్రకటించింది.

పారిశ్రామిక పద్మాలు వీరే

ఒసాము సుజుకీ (జపాన్-మరణానంతరం)	పద్మవిభూషణ్
నల్లి కుప్పస్వామి చెట్టి (తమిళ నాడు)	పద్మభూషణ్
పంకజ్ పటేల్ (గుజరాత్)	పద్మభూషణ్
అరుంధతీ భట్టాచార్య (మహారాష్ట్ర)	పద్మశ్రీ
ఓంకార్ సింగ్ పహ్వా (పంజాబ్)	పద్మశ్రీ
పవన్ గోయెంకా (బెంగాల్)	పద్మశ్రీ
ప్రశాంత్ ప్రకాశ్ (కర్ణాటక)	పద్మశ్రీ
ఆర్‌జీ చంద్రమోగన్ (తమిళ నాడు)	పద్మశ్రీ
సజ్జన్ భజంక (బెంగాల్)	పద్మశ్రీ
సాలీ హోల్కర్ (మధ్యప్రదేశ్)	పద్మశ్రీ

1 నుంచి 'బిల్డ్ నౌ' అమలయ్యేనా!

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ అనుమతులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయడం కోసం కొత్తగా అమల్లోకి తెచ్చిన 'బిల్డ్ నౌ' విధానంపై రాష్ట్ర ప్రభుత్వంలో ఇంత వరకు కదలికలు లేవు. ఇందుకు సంబంధించి అధికారుల్లో ఎలాంటి కదలికలు లేవు. సింగిల్ పోర్టల్ విధానానికి సంబంధించి విధి విధానాలు, దరఖాస్తుల పద్ధతి, అనుమతులు ఇవ్వడం వంటి విషయాలపట్ల ఇప్పటి వరకు క్షేత్ర స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాలు కూడా పూర్తి కాలేదు. దీంతో కొత్త విధానం అమలుపై అప్పుడే అనుమానాలు కలుగుతున్నాయి. రియల్ అనుమతుల కోసం సింగిల్ పోర్టల్ విధానం తీసుకువస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుందే కాని.. దానిని అమలు చేయడానికి కూడా ముందుకు రావడం లేదు. ముఖ్యంగా ఆయా మున్సిపాలిటీల పరిధిలో పని చేసే ఆర్కిటెక్చర్లు, అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఇవ్వాల్సిన శిక్షణ కూడా ఇవ్వలేదని తెలిసింది. ఇదిలా ఉంటే రియల్ ఎస్టేట్ అనుమతుల విషయంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించడం కోసం 'బిల్డ్ నౌ' పేరుతో సింగిల్ పోర్టల్ విధానం తీసుకువచ్చామని, ఈ కొత్త విధానాన్ని ఫిబ్రవరి 1 నుంచే అమల్లోకి తెస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు గతంలో ప్రకటన చేశారు.

యూబీఎస్ జీసీసీ విస్తరణ

హైదరాబాద్, జనవరి 25(నమస్తే తెలంగాణ): స్విట్జర్లాండ్‌కు చెందిన అతిపెద్ద బ్యాంకింగ్ సంస్థ యూబీఎస్.. వచ్చే రెండేండ్లలో హైదరాబాద్‌లోని తమ జీసీసీ సామర్థ్యాన్ని రెట్టింపు చేయనున్నట్లు, దీనివల్ల అదనంగా 1800 ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ప్రకటించింది. యూబీఎస్ ఇండియా చైర్మన్ హెరాల్డ్ ఎగ్గర్ శనివారం జ్యూరిచ్‌లో మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమైన అనంతరం ఈ ప్రకటన చేశారు. ఐటీతోపాటు వ్యాపార సేవల్లో తెలంగాణను మరింత బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం దోహదం చేస్తుందని ఆయన చెప్పారు. ఇక్కడి ప్రతిభకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ నీటిహక్కులను కాలరాసిందే కాంగ్రెస్

- ప్రాజెక్టుల వారీగా నీరు కేటాయించాలని నిబంధనలు
- సెక్షన్-3కు బదులుగా చట్టంలో సెక్షన్-89 మెలిక
- ఫలితంగానే నీటి పంపిణీలో రాష్ట్రానికి తీరని అన్యాయం
- నేడు నిస్సిగ్గుగా తమ వల్ల సాధ్యమంటూ అబద్ధాల ప్రచారం..
- సెక్షన్-3 కోసం రాష్ట్ర ఏర్పాటు నుంచే కేసీఆర్ పోరాటం..
- ఎట్టకేలకు తలొగ్గిన కేంద్రం
- ట్రిబ్యునల్‌కు సెక్షన్-3 మార్గదర్శకాలు

నీటి కుట్రలు.. మళ్లీ మొదలు

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): వంద ఎలుకలను తిన్న పిల్లి పుణ్యం కోసం తీర్థయాత్రలకు పోయిన చందంగా ఉన్నది ఇప్పుడు కాంగ్రెస్ వైఖరి. తెలంగాణ నీటి హక్కులను అడుగడుగునా కాలరాసి ఇప్పుడు తామే జలహక్కులను రక్షిస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్నది. నిస్సిగ్గుగా తాము చేసిన పాపాలన్నింటినీ బీఆర్ఎస్‌పై వేసేందుకు పూనుకున్నది. అందుకు సెక్షన్-3 అంశమే నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది. నదీజలాల హక్కులకు సంబంధించి తెలంగాణకు ద్రోహం తలపెట్టేలా సెక్షన్-89ను పొందుపరుస్తూ ఏపీ పునర్విభజన చట్టాన్ని రూపొందించిందే కాంగ్రెస్. సెక్షన్-3 ద్వారా జలాల పునఃపంపిణీ చేపట్టాలని అలుపెరగకుండా పోరాడి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చింది కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం. కానీ ఇప్పుడు అంతా తామే చేశామంటూ కాంగ్రెస్ జబ్బలు చరుచుకోవడం అటుంచి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమీ చేయలేదంటూ అభాండాలు వేయడంపై తెలంగాణవాదులు, నీటిరంగ నిపుణులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

అనాడు చట్టం చేసిందే కాంగ్రెస్..

ఏపీ పునర్విభజన చట్టం రూపంలో తెలంగాణకు తీరని ద్రోహాన్ని తలపెట్టింది కాంగ్రెస్సే. కేంద్రంలోని నాటి యూపీఏ సర్కారు నదీ జలాల్లో వాటాకు విరుద్ధంగా ఏపీ పునర్విభజన చట్టం 2014ను రూపొందించింది. పూర్తి విరుద్ధంగా చట్టంలో సెక్షన్-89 నిబంధనను పొందుపరచింది. ఆయా రాష్ట్రాల వినియోగంలో ఉన్న నదీ జలాలను మాత్రమే ప్రాజెక్టుల వారీగా పంపిణీ చేయాలని నిర్దేశించింది. అప్పటికే కొనసాగుతున్న బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కే ఆ బాధ్యతను అప్పగించింది. సాగునీటి ప్రాజెక్టుల అంశం రాష్ట్ర జాబితాలో ఉండగా, దానిని కేంద్రం చేతిలో పెట్టింది. బోర్డులను ఏర్పాటుచేసి, ప్రాజెక్టులు నిర్వహించాలని నిర్దేశించింది. సెక్షన్-89 ప్రకారం తెలంగాణ, ఏపీలకు న్యాయమైన నీటిపంపకాలను చేసే అధికారాలు తమకు లేవని కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్-2 చైర్మన్ బ్రిజేశ్‌కుమార్ సైతం తేల్చిచెప్పారంటే తెలంగాణకు కాంగ్రెస్ తలపెట్టిన విద్రోహం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. పునర్విభజన చట్టాన్ని అనుసరించే కేంద్రంలోని బీజేపీ సర్కారు రివర్ బోర్డుల గెజిట్‌ను విడుదల చేసింది. ప్రాజెక్టుల స్వాధీనానికి పూనుకున్నది. ఉమ్మడి రాష్ట్రంలోనూ తెలంగాణ నీటిహక్కులను పూర్తిగా కాలరాసింది. దౌర్జన్యం గా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ విస్తరణను నాటి సీఎం వైఎస్ చేపట్టినా తెలంగాణ కాంగ్రెస్ నేతలు నోరెమెదపలేదు.

తొమ్మిదిన్నరేండ్లు కేసీఆర్ పోరాటం..

ఉద్యమంలో ప్రతిధ్వనించిన న్యాయమైన నీళ్ల వాటా ఆకాంక్ష నెరవేరబోదని ఆదిలోనే నాటి సీఎం కేసీఆర్ గుర్తించారు. ఈ నేపథ్యంలోనే పరివాహక ప్రాంతం ఆధారంగా నీటివాటాలను తేల్చాలన్న డిమాండ్‌ను ముందుపెట్టారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం, తెలంగాణ ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ కేంద్రంలోని బీజేపీ సర్కారు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టం 1956లో సెక్షన్-3 ప్రకారం కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి న్యాయమైన నీటి వాటా తేల్చాలని వినతిపత్రం అందజేశారు. అయినప్పటికీ కేంద్రం చర్యలు చేపట్టకుండా కాలయాపన చేయడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్టోబర్ 6, 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో సీఎం కేసీఆర్ ట్రిబ్యునల్ అంశంపై పట్టుబట్టారు. దీంతో కేంద్రం ఎట్టకేలకు ట్రిబ్యునల్ ఏర్పాటుకు అంగీకరించింది. కొత్త ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలా? లేదంటే ప్రస్తుతమున్న బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కే సెక్షన్-3 ప్రకారం నీటి వాటాలు పంపిణీ చేసే అధికారాలను కల్పించాలా? అనేదానిపై న్యాయశాఖ సలహాను తీసుకోవాలని నిర్ణయించింది. అదీగాక మళ్లీ ఒక మెలిక పెట్టింది. సుప్రీంకోర్టులో వేసిన కేసును తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, ఆ తర్వాతనే న్యాయసలహా కోరతామని షరతు విధించింది. కేంద్రం సూచనల మేరకు తెలంగాణ ప్రభుత్వం కేసును ఉపసంహరించుకుంది. ఏడాదిన్నర గడిచినా కేంద్రం నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి పదేపదే లేఖలు రాస్తూ ఒత్తిడి తెచ్చింది. ఎట్టకేలకు కేంద్ర సర్కారు దిగివచ్చి సెక్షన్-3 ప్రకారం జలాల పునఃపంపిణీ చేయాలని ట్రిబ్యునల్ -2కు కొత్తగా టీవోఆర్‌ను జారీచేసింది. న్యాయశాఖ సలహా మేరకు కృష్ణా జలాల పునఃపంపిణీ అంశాన్ని తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు మాత్రమే పరిమితం చేయాలని నిర్ణయించింది. అదీగాక కొత్తగా టర్మ్ ఆఫ్ రెఫరెన్స్ తెలంగాణ, ఏపీ రెండు రాష్ట్రాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని, కృష్ణా నదీ జలాల వినియోగం, పంపిణీ, నియంత్రణ తదితర అంశాల్లో నెలకొన్న వివాదాలకు పరిష్కారం చూపుతుందని కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం సెక్షన్-3 ప్రకారమే విచారణ కొనసాగుతున్నది.

గోదావరి మిగులు జలాల తరలింపునకే 'బనకచర్ల'

- తెలంగాణ అభ్యంతరం చెప్పడం దురదృష్టకరం
- అమెరికాలో సగం అభివృద్ధి విజయవాడ వాళ్లదే
- ఎంవోయూలతో మాత్రమే పెట్టుబడులు వచ్చినట్టు కాదు
- ఏపీ సీఎం చంద్రబాబు

హైదరాబాద్, జనవరి 25 (నమస్తేతెలంగాణ): గోదావరి మిగులు జలాలను తరలించేందుకే బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు కడితే తాము అభ్యంతరం చెప్పలేదని, ఇప్పుడు బనకచర్లను నిర్మిస్తే అడ్డుకొనేందుకు యత్నించడం దురదృష్టకరమని వాపోయారు. శనివారం ఏపీలో విలేకరులతో మాట్లాడారు. 'హైదరాబాద్ నగరానికి వందల ఏండ్ల క్రితమే దేశంలో ప్రత్యేక గుర్తింపు ఉన్న విషయాన్ని ఉదహరిస్తూ బాబు వ్యాఖ్యలపై నెటిజన్లు భగ్గుమంటున్నారు. దేశానికి రెండో రాజధానిగా గుర్తింపు పొందిందని, చంద్రబాబు రాక ముందే ఇక్కడి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అభివృద్ధికి అడుగులు పడ్డ విషయాన్ని గుర్తుచేస్తున్నారు. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి అంకురార్పణ చేసిన హైటెక్‌సిటీని నిర్మించింది తానేనని చెప్పుకోవడం బాబుకే చెల్లిందని దుమ్మెత్తిపోస్తున్నారు. ఇప్పటికైనా గొప్పలు చెప్పడం మాని వెనుకబడిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై దృష్టిపెట్టాలని సెటైర్లు వేశారు.

అవే గొప్పలు.. గప్పాలు

రాష్ట్రం విడిపోయి పదేండ్లు దాటింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా ఎవరికీ వారు ప్రశాంతంగా జీవిస్తున్నారు. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం శక్తిమేర అభివృద్ధి పథంలో సాగుతున్నాయి. ఇలాంటి సమయంలో మళ్లీ చంద్రబాబు హైదరాబాద్‌ను ఉద్ధరించింది తానేనంటూ.. తాను ముఖ్యమంత్రి కాక ముందు హైదరాబాద్‌ను ఎవరూ గుర్తించలేదని గొప్పలు చెప్పడాన్ని తెలంగాణ వాసులు జీర్ణించుకోవడంలేదు. హైదరాబాద్ నగరానికి వందల ఏండ్ల క్రితమే దేశంలో ప్రత్యేక గుర్తింపు ఉన్న విషయాన్ని ఉదహరిస్తూ బాబు వ్యాఖ్యలపై నెటిజన్లు భగ్గుమంటున్నారు. దేశానికి రెండో రాజధానిగా గుర్తింపు పొందిందని, చంద్రబాబు రాక ముందే ఇక్కడి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అభివృద్ధికి అడుగులు పడ్డ విషయాన్ని గుర్తుచేస్తున్నారు. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి అంకురార్పణ చేసిన హైటెక్‌సిటీని నిర్మించింది తానేనని చెప్పుకోవడం బాబుకే చెల్లిందని దుమ్మెత్తిపోస్తున్నారు. ఇప్పటికైనా గొప్పలు చెప్పడం మాని వెనుకబడిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై దృష్టిపెట్టాలని సెటైర్లు వేశారు.

తేదీల వారీగా కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషి..

15-05-2014: ప్రాజెక్టుల వారీగా కృష్ణా జలాల నిర్దిష్ట కేటాయింపులు చేయడానికి, ఆపరేషన్ ప్రొటోకాల్ రూపకల్పనకు ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్ 89 నిబంధనలతో ట్రిబ్యునల్ పదవీకాలాన్ని పొడిగిస్తూ గెజిట్ విడుదల.

02-06-2014: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు

14-07-2014: సెక్షన్ 3 ప్రకారం కృష్ణాజలాల పునఃపంపిణీ చేపట్టాలని కోరుతూ కేంద్రానికి ముఖ్యమంత్రి కేసీఆర్, తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి. ఫిర్యాదు దాఖలు.

29.08.2014: తెలంగాణ అభ్యర్థనపై సలహా ఇవ్వాలని న్యాయశాఖకు రెఫర్ చేసిన కేంద్రం.

08.09.2014: సెక్షన్-3పై తెలంగాణ చేసిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోవచ్చని కేంద్రానికి సూచించిన న్యాయశాఖ.

10-08-2015: ఏడాది పూర్తయినా కేంద్రం ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ప్రభుత్వం.

17.11.2015: న్యాయశాఖ సలహాను ఆమోదించిన కేంద్ర జలశక్తిశాఖ.

07.12.2015: 20 రోజులు తిరగకుండానే నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న కేంద్రం.

21-09-2016: మొదటి అపెక్స్ కౌన్సిల్ సమావేశం.

ఆగస్ట్ 18, 2018: సెక్షన్-3 ఫిర్యాదును వెంటనే పరిష్కరించాలని కేంద్ర జలవనరుల - శాఖ మంత్రికి లేఖ రాసిన తెలంగాణ ప్రభుత్వం.

26-12-2018: సెక్షన్-3 ఫిర్యాదును తెలంగాణ, ఏపీ మధ్యనే పరిమితం చేసే ట్రిబ్యునల్